క్లుప్తంగా

'అసత్య ప్రచారాలను నమ్మొద్దు'

పటాన్‌చెరు టౌన్: దళితబంధు పథకంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా సీఎం కేసీఆర్ దళితుల ఆర్థికాభివృద్ధికి చారిత్రాత్మకమైన దళిత పథకాన్ని ప్రవేశపెట్టారని, విడతలవారీగా అర్హులైన దళితులందరికీ పథకాన్ని వర్తింపచేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మూడు గ్రామాల్లో 100 కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపచేశామని, నేడు ఆ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. మొదటి విడతగా నియోజకవర్గవ్యాప్తంగా 1100 మంది దళిత కుటుంబాలకు దళితబంధు అమలు చేయబోతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

గొల్లకురుమల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: గొల్లకురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గంగాపూర్‌లో శనివారం రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ్మారెడ్డి, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, రమేష్‌చౌహాన్, అంజాగౌడ్, దత్తు పాల్గొన్నారు. అనంతరం కంగ్టి మండలం తుర్కవడ్‌గాంకు చెందిన కాంగ్రెస్ నాయకులు దేవిదాస్, బాబు, ప్రకాష్, సతీష్, దయానంద్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఓటర్‌గా నమోదు చేయించుకోవాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి సూచించారు. మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కాలనీల ప్రజలకు వద్దకు వెళ్లి ఓటు నమోదు కానివారి వివరాలను అధికారులు సేకరించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న మున్సిపాల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. హరితహారంలో భాగంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలలో వేల సంఖ్యలో మొక్కలు నాటుతామని తెలిపారు. కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బర్దిపూర్‌లో షార్ట్ ఫిలిం సందడి

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో షార్ట్ ఫిలిం షూటింగ్ జరుగుతుండటంతో సందడి నెలకొంది. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎంకె ప్రొడక్షన్స్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో షూటింగ్ నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలో అందరూ సమానమేనని ఉద్దేశంతో షూటింగ్ చేస్తున్నామని, ఆగస్టు 15న షార్ట్ ఫిలిం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది.



సన్నివేశాలను చిత్రీకరిస్తున్న నిర్వాహకులు

హత్నూరకు రూ.8 కోట్లు మంజూరు

- త్వరలో డివైడర్ రోడ్డు పనులు ప్రారంభం
- మారనున్న హత్నూర ప్రాంత రూపురేఖలు
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



నిధుల మంజూరు ఆర్డర్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలో డివైడర్ రోడ్డు నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ రూ.8 కోట్ల నిధులను మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్డర్ కాపీని శనివారం హత్నూర సర్పంచ్ వీరస్వామిగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి ఇప్పటికే 4.50 కోట్ల నిధులను మంజూరు చేసి పలు అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. హత్నూర పెట్రోల్ బంక్ నుంచి ఐటీఐ కాలనీ వరకు రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు గాను సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సర్పంచ్ వీరస్వామిగౌడ్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, నాయకులు ఆకుల కిష్టయ్య, ఆసిఫ్, ఖదీర్, పెంటేష్, వెంకటేశం గౌడ్, ధనుంజయ, అశోక్ పాల్గొన్నారు.

ఏపీ గవర్నర్‌కు ఘన స్వాగతం

జహీరాబాద్ టౌన్: ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అధికారులు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నజీర్ కర్నాటక రాష్ట్రంలోని గుల్‌బర్గాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో జహీరాబాద్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని మహీంద్ర అతిథిగృహంలో గవర్నర్‌ను జహీరాబాద్ ఆర్డీఓ వెంకారెడ్డి, డీఎస్పీ రఘుతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసులు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు గౌరవ వందనం సమర్పించారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

పాఠశాల బస్సులు ధ్వంసం



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని చిమ్నాపూర్ సమీపంలోని జ్ఞానజ్యోతి విద్యాలయానికి చెందిన బస్సు అద్దాలను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, పాఠశాల నిర్వాహకులు మనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రోజుమాదిరిగానే శుక్రవారం విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చి తిరిగి పాఠశాల ఆవరణలో బస్సులను నిలిపి ఉంచారు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో వచ్చి మూడు బస్సుల అద్దాలను ధ్వంసం చేశారు. అదేవిధంగా బోరుబావి మోటారుకు ఏర్పాటు చేసిన తాడును తొలగించి మోటారును లోపలికి వదిలిపెట్టారు. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన నిర్వాహకులు జరిగిన సంఘటనను పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సిబ్బందితో కలిసి పాఠశాలకు వచ్చి వివరాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలించారు. పాఠశాల నిర్వాహకుడు మనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతుల కుటుంబాలకు దామోదర పరామర్శ

రాయికోడ్(అందోల్): మండలంలోని ధర్మాపూర్, రాయికోడ్, సింగితం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ శనివారం పరామర్శించారు. ధర్మాపూర్‌లో స్థానిక నాయకుడు శాంత్‌కుమార్ తల్లి బిరద్దార్ సంగమ్మ, సింగితంలో పార్టీ కార్యకర్త అంబమ్మ, రాయికోడ్‌లో మరో ఇద్దరు కార్యకర్తలు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబసభ్యులను తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాయికోడ్‌కు చెందిన పార్టీ కార్యకర్త పాండు దుకాణంలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడగా బాధితుడి షాపును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలు, యూత్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సర్పంచ్ కేధారినాథ్ పాటిల్, పీఏసీఎస్ చైర్మన్ నాగిశెట్టి, నాయకులు సతీష్‌కుమార్, రాజు, బాలయ్య, మోహన్, రఫిక్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం : న్యాయమూర్తి

సంగారెడ్డి టౌన్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని అదనపు జిల్లా నాయమూర్తి లావణ్య అన్నారు. శనివారం సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ స్టేడియంలో క్రీడల పోటీలను ప్రారంభించారు. జూనియర్ సివిల్ జడ్జి తేజశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మహేష్, క్రిష్ణ, రాంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సంగమేశ్వరస్వామి కల్యాణం

సంగారెడ్డి అర్బన్: అధిక శ్రావణమాసం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని సంగమేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ధర్నాకు తరలిన బీజేపీ నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు శనివారం రామచంద్రాపురం పట్టణం నుంచి బీజేపీ నేతలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి, దుబ్బాక నియోజకవర్గ నాయకులు పాలక్ అంజిరెడ్డి, నాయకులు శ్రీకాంత్, నాగేశ్వరరావు, యాదగిరి, పూర్ణిమ, బసవమ్మ పాల్గొన్నారు.

◆ అర్హత సాధించిన అభ్యర్థులకు కౌన్సిలింగ్

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ లిస్టు సంగారెడ్డిలోని డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉందని డీఈఓ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లు తీసుకొని సోమవారం ఉదయం 10గంటలకు సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతులతో పాటు చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6:00 వరకు పటాన్‌చెరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కిషన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ బీసీబంధు చెక్కుల పంపిణీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూరు మండలంలోని 17 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బీసీబంధు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో చౌటకూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చౌకంపల్లి శివకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ అలీమ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

◆ నారాయణకు సన్మానం

జహీరాబాద్: మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన తట్టు నారాయణను నియోజకవర్గం గొల్ల కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్, రాజ రమేష్, పెద్దగొల్ల నారాయణ, మారుతి, శ్రీపతి, శివరాజ్, లక్ష్మణ్, విశ్వనాథ్ యాదవ్, పాండు, పులేందర్, మల్లు, రాజు, దిలీప్, మారుతి, నాగరాజు, శ్రీనివాస్, తుల్జరాం, వేణు, పవన్, బీర్‌గొండ, శంకర్ పాల్గొన్నారు.

◆ నేడు ఆర్థిక సాయం

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల మండల పరిధిలోని కుప్పనగర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బాధిత కుటుంబానికి శనివారం ముదిరాజ్ సంఘం నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎస్టీఓ నారాయణ మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరయ్య, గోపాల్, దత్తాత్రి, సంగమేశ్వర్, పాండు, నరసింహులు పాల్గొన్నారు.

◆ నేడు జాతీయ పతాకాలతో ప్రదర్శన

నారాయణఖేడ్: మేరిమాటి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న ఆదివారం నారాయణఖేడ్‌లో జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఖేడ్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొటాలే రజినీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ భవానీమాత మందిరం నుంచి ప్రదర్శన ప్రారంభమై పట్టణ ప్రధాన రహదారుల గుండా కొనసాగుతుందన్నారు.

◆ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలోని కడ్పల్‌లో అనాథ పిల్లలు సావిత్రి, శివానికి ఎన్‌టీటీ డాటా సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ సహకారంతో శనివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థ తరపున ప్రతినిధి చంద్రశేఖర్ ఆచార్య నెలరోజులకు సరిపోయే సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌లకు పదోన్నతులు

సంగారెడ్డి టౌన్: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌లకు తహసీల్దార్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ డాక్టర్ శరత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న పదిమంది డిప్యూటీ తహసీల్దార్‌లను తహసీల్దార్‌లుగా పదోన్నతులు కల్పించారు. పదోన్నతి పొందినవారిలో కొందరిని సంగారెడ్డి జిల్లాలో, మరో కొందరిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నారాయణఖేడ్: ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నారాయణఖేడ్‌లో ఆ సంఘ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి అశోక్, జిల్లా, స్థానిక బాధ్యులు ఆనంద్, తెంకటి కుమార్, ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, శ్రీమాన్, అరవింద్ పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

సంగారెడ్డి అర్బన్: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ జయంతిని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు పట్లోళ్ల నరహరిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నరహరిరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత రంగనాథన్ గ్రంథాలయ విషయ పరిజ్ఞానాన్ని విభాగాల వారీగా వర్గీకరణ చేయుటకు గ్రంథాలయ శాస్త్రంలో నూతన మార్పులను తీసుకువచ్చారని తెలిపారు. విషయపరంగా కోలన్ వర్గీకరణ సిద్ధాంతాన్ని భారతదేశంలో మొదటగా ప్రతిపాదించారని వివరించారు. కార్యక్రమంలో సహాయగ్రంథ పాలకులు శ్రీనివాస్, సిబ్బంది నాగరాజు, పాఠకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటన, ఎన్‌ఈపీ–2020 రద్దు, ఉపాధ్యాయుల బదిలీ పదోన్నతులను కల్పించాలని కోరుతూ సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు అశోక్, నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ కమిటీ వేసి జూలై 1 నుంచి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం 2020ను రాష్ట్రంలో అమలు చేయొద్దని, భాషా పండితులు, పీఈటీల పదోన్నతులపై ఉన్న న్యాయపరమైన చిక్కులు తొలగించి పదోన్నతులు కల్పించాలని కోరారు. జీవో 317 ప్రకారం బాధితులకు న్యాయం చేయడంతో పాటు స్పెషల్ టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు జ్ఞానమంజరి, జిల్లా నాయకులు సాయిలు, రామచందర్, కాశీనాథ్ జాదవ్, శ్రీనివాసరావు, లక్ష్మయ్య యాదవ్, శామయ్య పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను మినహాయింపును పెంచాలి

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.8లక్షలకు పెంచాలని టీఎస్ యూటీఎఫ్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టీఎస్ యూటీఎఫ్)24వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంగారెడ్డి జిల్లా కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌జాదవ్, కోశాధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు అమరేశ్వరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మట్టిని పోయిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలతో పాటు ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా స్థానిక కౌన్సిలర్ నిహారిక, బీఆర్‌ఎస్ నాయకులు వరప్రసాద్‌రెడ్డి స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నారు. ప్రధాన రహదారిలో గుంతలు పడటంతో శనివారం మట్టిని పోయించి తాత్కాలిక మరమ్మతు పనులను చేయించారు. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు వెంటనే నిధులు కేటాయించాలని కోరారు.

సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. డివిజన్ పరిధిలోని కానుకుంటలో రూ.32 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లేష్, శ్రీనివాస్ రాజు, సత్యనారాయణరెడ్డి, గౌస్, కాలనీవాసులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

అధికార పార్టీ వాళ్లకేనా దళితబంధు?

- నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: ఎన్నికల సమయంలోనే సీఎంకు దళితులు గుర్తుకొస్తారా? అధికార పార్టీ వాళ్లకేనా దళిత బంధు? అని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని దళిత కుటుంబాలకు దళితబంధు ఇవ్వాలని బీరంగూడ మండే మార్కెట్ నుంచి శివాలయం చౌరస్తా వరకు ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన దళితులకే దళితబంధు పథకానికి ఎంపిక చేస్తున్నారని వాపోయారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి దళితబంధు అమలు చేసేవరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్స్, శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, వడ్డె కృష్ణ, నర్సింగ్‌రావు, అశోక్ ముదిరాజ్, మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ మన్నె రవీందర్, కౌన్సిలర్లు లావణ్య శశిధర్‌రెడ్డి, సునీత, ట్రెజరర్ సుధాకర్‌యాదవ్, జనరల్ సెక్రటరీలు సలీం, కుమారి, మహేష్, రమేష్‌యాదవ్, సంగారెడ్డి జిల్లా మైనారిటీ చైర్మన్ హబీబ్‌జానీ, సంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ప్రవీణ్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

హత్నూర(సంగారెడ్డి): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని సాదుల్లానగర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేష్ ఈ నెల 7వ తేదీన బైక్‌పై ఆవంచ గ్రామానికి వెళ్తుండగా మంగాపూర్ శివారులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

జహీరాబాద్ టౌన్: ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మెల్లిమెలి సాయన్న ఈ నెల 2 తేదిన తన ఇంటిపై కట్టెలను తీసుకొచ్చే క్రమంలో కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలవడంతో జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల కేంద్రంలో శనివారం పిచ్చికుక్క ఐదుగురిపై దాడిచేయడంతో గ్రామానికి చెందిన ఇందురి రాజు, శేగోళ్ల బాలరాజు, బాబు, సవిత, తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు గాయపడినవారిని కల్హేర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పిచ్చికుక్కను గ్రామస్తులు వెంబడించి చంపేశారు.



ఇంజెక్షన్ తీసుకుంటున్న బాలరాజు